## ఈ వారం కథ

# జపనీస్ బొమ్మ

— డాక్టర్ జె. భాగ్యలక్ష్మి

సురేంద్ర ఎన్నో గిఫ్టులు తెచ్చాడు. అతను జపాను వెళ్లడం ఇదే ప్రథమం. చదువురీత్యా, ఉద్యోగరీత్యా అమెరికాకు, యూరప్‌కు ఎన్నోసార్లు వెళ్ళివచ్చాడు. కాని విచిత్రమైన వస్తువులకు జపాను పెట్టింది పేరు. అందుకే అరచేయంతటి టెలివిజను, గుప్పెడు సైజులో వున్న వీడియో కెమెరా మరెన్నో విచిత్రమైన వస్తువులు తెచ్చాడు.

పిల్లలు సూటుకేసు వద్ద కూర్చుని నాన్నగారు తెచ్చిన బొమ్మలు, ఆట వస్తువులు వింతగా చూస్తున్నారు. "ఇదెలా నడుస్తుంది? ఇదేం చేస్తుంది? నిజమైన హెలికాప్టరే. ఇది మరమనిషా? మరీ చిన్నది కదూ" అంటూ తండ్రిని ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు. సురేంద్ర అన్నిటికీ నవ్వుతూ సమాధానం చెబుతూ ఒక్కొక్క వస్తువే అందించి అందులోని వింత ఏమిటో చూపిస్తున్నాడు.

పిల్లల దృష్టి ఒక మూలనున్న ప్యాకెట్టు మీద పడింది.

"అదేమిటి నాన్నా" అని అడిగింది సుశీల.

"అదెవరికోసం?" అన్నాడు దీపక్.

"అది మీకు కాదులే" అని దాన్ని దూరంగా పెట్టబోయాడు సురేంద్ర.

"అదేమిటో చూపించండి నాన్నగారూ" అని మారాం చేస్తున్నట్టు అడిగింది సునీల.

"చూపిస్తాను. కాని ముందుగా మీ అమ్మ చూడాలి. తనకోసం స్పెషల్ గిఫ్టు ఇది"

"అమ్మా, త్వరగా రా అమ్మా" అని కేకలు పెట్టారు పిల్లలిద్దరూ.

"ఏమిటీ గొడవ. అంతదూరం నుంచి వచ్చారు. ఆయన్ని కాస్త ఊపిరి పీల్చుకోనివ్వరా?" అంటూ కాఫీ పట్టుకొచ్చింది నీరజ.

అక్కడ పరచిపెట్టి వున్న బొమ్మలన్నీ చూస్తూ, "ఎంతెంత డబ్బు పెట్టికొన్నారండీ! అదీ ఫారిన్ మనీ. అసలే చాలీ చాలనట్లు ఇస్తారు. మీ ఖర్చులు చూసుకోకుండా ఇవన్నీ ఎందుకు తెచ్చారు? అందులో ఈ పిల్లలు రెండు రోజుల్లో వీటిని మూలకో ముక్కగా పారేస్తారు" అంది.

సురేంద్ర నవ్వుతూ "పోనిద్దూ" అన్నట్టు తల ఊపి కాఫీ అందుకున్నాడు.

"అమ్మా నీకు స్పెషల్ గిఫ్టు" అని సన్నగా గొణిగింది సునీల.

సురేంద్ర ఆ ప్యాకెట్ తీసి అందించాడు. నీరజ రంగు కాగితాలన్నీ ఊడదీసింది. పిల్లలిద్దరూ చెరో కాగితం దాచుకొన్నారు. చివరకు బయట పడింది బొమ్మ. "అబ్బ ఎంత బాగుందో" అన్నారు పిల్లలిద్దరూ ఒకేసారి.

"నేను ఒకసారి చూసి ఇస్తానమ్మా" అంది సునీల.

"నేను కూడా" అన్నాడు దీపక్.

"జాగ్రత్త, పడిపోగలదు" అంది నీరజ సునీల చేతుల్లోకి దాన్ని అందిస్తూ.

అది అతినాజూకయిన జపాను బొమ్మ. చాలా అందంగా వుంది. కిమోనాలో వుంది. చేతిలో నెమలి పింఛంలా విప్పారిన విసనకర్ర. కళ్ళు ఇటూ, అటూ తిప్పుతుంది. ఒక నృత్య భంగిమ చూపిస్తుంది. మరలా మామూలే.

"దీనికి ఏం పేరు పెడదాం?" అని అడిగింది సునీల.



"జపాను పేర్లేమైనా నీకు తెలుసా?" అని అడిగాడు దీపక్.

"ఇప్పుడు ఇండియాకు వచ్చింది. కాబట్టి ఇండియా పేరే పెట్టాం" అంది సునీల.

"అలా కుదరదు. ఎక్కడివాళ్ళకు అక్కడి పేర్లే బాగుంటాయి" అన్నాడు దీపక్.

"ఇద్దరూ బాగా ఆలోచించి ఏదో ఒక పేరు పెట్టండి" అని తీర్పు చెప్పాడు సురేంద్ర.

"సుజాకీ" అన్నాడు దీపక్.

"ఛా, అది కారు పేరు" అంది సునీల. వాళ్ళిద్దరూ కాసేపు ఆ బొమ్మను ఇటూ అటూ తిప్పి చూసి వాళ్ళమ్మకు ఇచ్చేశారు. తమ బొమ్మలు పట్టుకొని ఆడుకోటానికి వెళ్ళారు.

నీరజ ఆ బొమ్మనే చూస్తూ కూర్చుంది. "నీకు నచ్చిందా? కొత్తకొత్త బొమ్మలు సెలెక్ట్ చెయ్యడం నీ హాబీ కదా. ఇది నీ కలెక్షన్‌లోకెల్లా గొప్పగా వుండాలని తెచ్చాను. డ్రాయింగ్ రూంలో పెట్టావంటే ఇక వచ్చిన వాళ్లంతా దీని గురించే అడుగుతూ వుంటారు. ఒక్కసారిగా నీ పాపులారిటీ పెరిగిపోతుంది" అంటూ సోఫాలోనే ఆమె ఒడిలో తలపెట్టి పడుకొన్నాడు సురేంద్ర.

నీరజ నవ్వింది. భర్త జుట్టు నిమురుతూ "మీ ట్రిప్పు బాగా జరిగిందా? చూడవలసిన స్థలాలన్నీ చూశారా?" అని అడిగింది. "ఓయస్. ఎక్సలెంట్. వెళ్ళిన పనితో బిజీగా వున్నందున ఎక్కువ స్థలాలు చూడలేదనుకో. కానీ ఈ దేశం వేరు మనకు తెలిసిన విదేశాలలా లేదు"

"తిండీ, తీర్థం..."

"తిండి పరవాలేదు. కాని తీర్థం సంగతి నీకు తెలుసుకదా నేను పుచ్చుకోనని..."

"అబ్బా ఆ విషయం కాదు. మరీ డబ్బా కొట్టొద్దు. టూరు మీ విగ్రహం గురించి."

"కానీ చాప్‌స్టిక్స్‌తో నేనసలు ఒక ముక్క కూడా నోట్లో పెట్టుకోలేకపోయాను. అవి పట్టుకోటం వస్తే కదా. అది గొప్ప ఆర్టనుకో. అయితే ఇబ్బందేం లేదు. ఫోర్కు, కత్తి వుండనే వున్నాయి." నీరజ నవ్వింది. "మనకు మొదటి నుండీ అవే గొప్ప నాగరికం" అంటూ పక్కనున్న జపాను బొమ్మ చేతిలోకి తీసుకొని మౌనంగా చూస్తూ వుండిపోయింది.

"ఇందాకా ఈ బొమ్మ నచ్చిందా అంటే నువ్వేమీ మాట్లాడలేదు!"

"నచ్చింది. బాగుంది. ఎ రేర్ పీస్, బట్..."

"బట్ వాట్?"

"ఈ బొమ్మను గాజు కేసులో ఎందుకు బంధించినట్లు? నాకెందుకో... అయ్యో! పాపం అనిపిస్తోంది."

"అదేం కొత్త? మట్టిపడకుండా, మురికి కాకుండా బొమ్మల్ని గాజు కేసులో పెట్టడం మామూలే కదా"

"నిజమేననుకోండి. కానీ ఇది మరో బొమ్మా మరో బొమ్మా కాదు. ఒక ఆడ బొమ్మ. అందంగా అలంకరించి, ఆకర్షణీయంగా చేసి బందిఖానా వంటి గాజు కేసులో పెట్టారు. ఇటీజ్ సింబాలిక్. ఇది

## చాప్లిన్

చాప్లిన్ ఆనాటి వర్కు హౌసుల్లోని (అనాథ శరణాలయాలు) దారుణ పరిస్థితులను ఒక్క చిన్న సంఘటనతో మన కళ్ళ ముందుంచుతాడు. అతను అమెరికాలో స్థిరపడి మూకీ చిత్రాలు తీస్తున్న సమయం అది "ది కిడ్" అనే చిత్రం నిర్మిస్తున్నాడు. తండ్రి— అయిదారేళ్ళ కొడుకు— ఈ రెండు ప్రధాన పాత్రలతో చిత్రం నిర్మిస్తున్నాడు. కొడుకు పాత్ర ధరించేందుకు ఒక కుర్రవాడిని తీసుకుని కొంత చిత్రం చిత్రీకరించారు. ఒక సన్నివేశంలో ఆ కుర్రవాడు ఏడ్వాలి. కానీ చాప్లిన్ ఎంత చెప్పినా వాడు ఏడ్వనే ఏడ్వడు. నిస్సహాయంగా ఆ కుర్రవాని తండ్రితో ఫిర్యాదు చేశాడు చాప్లిన్. అప్పుడా తండ్రి (పాత్ర తండ్రి కాదు) వాళ్ళందరినీ బయటికి పొమ్మన్నాడు. కాసేపున్నాక వాళ్ళందరినీ పిలిచాడు. చిత్రం.. కుర్రవాడు ఆపసోపాలుగా ఏడుస్తున్నాడు. ఆ సన్నివేశాన్ని చిత్రీకరించాక చాప్లిన్ అతన్ని 'అబ్బాయిని ఎలా ఏడిపించా'వని ప్రశ్నించాడు. వాడిని బాగా తన్ని వుంటాడని చాప్లిన్ ఊహ. కానీ అలా ఏం జరుగలేదు. "నీ విప్పుడు ఏడవక పోతే నిన్ను మళ్ళీ వర్కుహౌసు (అనాథశరణాలయం)లో పారేసి వస్తా" అని మాత్రమే అన్నాడట వానితో, అంతే వాడు తక్షణం ఏడుపు లంకించుకున్నాడు. ఆనాటి అనాథ శరణాలయాలు ఎలా నరక సదృశంగా వుండేవో వూహించేందుకు ఈ ఒక్క సంఘటన చాలు..

—సేకరణ: భమిడిపాటి వెంకటేశ్వరరావు

మంచిదంటారా?"

"ఏమిటి కథ?" "ఖైద్ మే హై బుల్ బుల్" లాంటి సినిమాలేమైనా ఎక్కువగా చూస్తున్నావా ఈ మధ్య! అదేదో ప్రాణంతో వున్నట్టు దాన్ని బందిఖానాలో వుంచినట్లు ఊ తెగ బాధపడిపోతు న్నావు" నవ్వుతూ అన్నాడు సురేంద్ర. "అసలు బొమ్మలు ప్రథమంగా ఏం చెబుతాయి? ఒక ప్రాంతం కల్చరు, బట్టలు, మనిషి జీవించే తీరు తెన్నులూతెలియజేస్తాయి. ఏదో ఒక ప్రదేశానికి వెళ్ళిన గుర్తుగా ఇవి కొంటాం అంతే. అంతకుమించి మరేం లేదు."

"అవుననుకోండి. అంతేకాక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనం ఆలోచించే తీరు తెన్నులు కూడా తెలియజేస్తాయి కదా!" అని నీరజ ఆ బొమ్మను తీసుకెళ్ళి బుక్ కేసు మీద పెట్టింది. "ఎక్కువగా ఫెమినిస్టు ఐడియాలుంటే ఇలాగే ఆలోచిస్తారు. వాటికీ హద్దుండాలి. బొమ్మలకు, రాళ్ళకు, రప్పలకు కూడా మన సిద్ధాంతాలు అన్వయించామంటే ఇక బతకడం కష్టమవుతుంది" అని సురేంద్ర లేచి గదిలోకి వెళ్ళాడు.

ఇంటికి వచ్చిన వాళ్ళంతా ఆ బొమ్మను తెగమెచ్చుకొంటున్నారు. "ఎక్కడిది! ఎంత ఖరీదు! ఎప్పుడు తెచ్చారు!" అని అడుగుతూనే వున్నారు. అప్పుడు ఇంట్లో ఎవరుంటే వాళ్ళు అన్నిటికీ సమాధానాలు చెబుతున్నారు. కొందరు ఫ్రెండ్సయితే కేవలం బొమ్మను చూడడానికే వచ్చారు కూడా.

కాని ఆ బొమ్మ కంటపడినప్పుడల్లా నీరజ మనస్సు కలుక్కుమంటోంది. నీరజ ఒక స్త్రీల పత్రిక నడుపుతోంది. ఆ పత్రిక విశిష్టమైంది. మామూలుగా కుట్లు, అల్లికలు, వంటలు, పిండి వంటలు, ప్రేమ కథలు అంటూ స్త్రీ లోకం చుట్టూ గిరి గీయకుండా స్త్రీని వ్యక్తిగా, ఇంటలెక్చ్యుయెల్‌గా తీర్చిదిద్దడానికి, సామాజికంగా జాగృతి కలిగించడానికి ప్రయత్నించే పత్రిక అది. నేటి సమాజంలో అతి సహజంగా శృంఖలాలతో బతికేస్తూ, ప్రతి చిన్న విషయానికీ కృతజ్ఞతలు తెలుపుకొంటూ, అణిగీ మణిగీ జీవితాలను సాగిస్తూ, తమనితాము కించపరచుకొంటున్న స్త్రీలకు తమ శక్తి ఏమిటో, తమ హక్కులేమిటో తెలుసుకొమ్మని, తమకు జరిగే అన్యాయాలను ప్రతిఘటించమని, ఆత్మ స్థైర్యాన్నీ, అంతఃశక్తినీ చేకూర్చుకోమని ఉద్బోధించే పత్రిక అది.

మొదటి నుంచి సమస్యలను స్త్రీ పరంగా ఆలోచించి, వాళ్ళకు జరుగుతున్న అన్యాయాలకు చలించి, తను చేస్తున్న లెక్చరర్ ఉద్యోగం వదిలి పత్రిక పెట్టింది నీరజ. తనకు అప్పటికి ఫెమినిస్టు ఐడియాలూ తెలీదు. ఉమెన్స్ లిబ్ ఉద్యమం గురించీ తెలీదు. అవి తెలిసిన తర్వాత వాటిలో కొన్ని అంశాలు తనకు షాలోగా, నాటకీయంగా కనిపించాయి.

అనవసరమైన మిలిటన్సీ చూపడం, అయినదానికీ, కాని దానికీ గొంతెత్తి అరవడమే స్త్రీ స్వాతంత్ర్య లక్ష్యం కాదని కూడా నీరజ గుర్తించింది. ఎన్నో సభలలో, కాన్ఫరెన్స్‌లలో తన భావాలు బయటపెట్టి మన్ననలందుకొంది. తనకు స్త్రీల ప్రతినిధిగా ఎంతో పేరుంది. అటువంటి నీరజ ఈ నాడు ఒక బొమ్మ గురించి చాలా ఆందోళన చెందుతోంది. ఆ బొమ్మను చూసినప్పుడల్లా గిల్టీగా ఫీలవుతూంది. అది తన సైకాలజీ మీద పనిచేస్తోంది.

స్త్రీ విముక్తి గురించి మాట్లాడే తను గాజుకేసులో బంధించిన ఒక స్త్రీ బొమ్మను గొప్పగా డ్రాయింగ్ రూంలో పెట్టుకొంది. సూచనప్రాయంగా తనెటువంటి భావనకు దోహదం చేస్తోంది! ఆ బొమ్మ నిస్సహాయంగా కనిపిస్తోంది. దీనంగా అర్థిస్తున్నట్లుంది.

ఇక భరించలేక ఆ బొమ్మను డ్రాయింగ్ రూం నుంచి తీసి లోపల ఎక్కడో అలమారాలో దాచేసింది. సాయంత్రం ఆఫీసు నుండి రాగానే ఆ బొమ్మ మామూలుగా డ్రాయింగ్ రూంలో సైడు టేబిల్ మీద ప్రత్యక్షమైంది.

"ఈ బొమ్మ ఇక్కడికెలా వచ్చింది?" అని అడిగింది కూతుర్ని.

"నాన్నగారు తెచ్చిపెట్టారు" అంది సునీల.

నీరజ తిరిగి దాన్ని తీసుకొని లోపలికి వెళ్లింది. అలమారలో దాచెయ్యాలని. గదిలో ఏదో పత్రిక చదువుతున్న సురేంద్ర కనిపించాడు. "మళ్ళీ దీన్ని లోపలికి తెస్తున్నావేమిటి? అదేదో అసభ్య దృశ్యంలా, అదక్కడ వుండడమే సిగ్గు చేటులా అనుకొంటున్నట్టుంది నీ వ్యవహారం మాస్తుంటే! లోపల దాచెయ్యటానికేనా అంత డబ్బు పెట్టి కొన్నది? నీ కోసం ప్రత్యేకంగా వెతికి వెతికి తెచ్చానే, ఆ అభిమానమైనా లేదా?"

ఆయనకు తన మనసులోని మాట ఎలా చెప్పాలో అర్థం కాలేదు నీరజకు. కథలు, పిల్లల పాఠ్యపుస్తకాలు కూడా ఆడ పిల్లను తక్కువ చేయకుండా వుండే తీరులో అతిశ్రద్ధగా వ్రాస్తున్న ఈ రోజుల్లో బొమ్మల విషయంలో కూడా శ్రద్ధ వహించాలి కదా. పిల్లలకు ఆడుకోటానికి తుపాకులు, కత్తులు ఇస్తే వాళ్ళ మనస్థితి ఎలా వుంటుంది? ఇంతలో "సునీలా" అని కూతుర్ని పిలిచాడు సురేంద్ర.

"ఏమండీ నాన్నగారూ" అంటూ వచ్చింది సునీల.

"ఈ బొమ్మ తీసుకెళ్లి డ్రాయింగ్ రూంలో పెట్టమ్మా."

సునీల తల్లి చేతిలో నుండి బొమ్మ తీసుకొంది డ్రాయింగ్ రూంలో పెట్టడానికి. నీరజ ఏదో చెబుదామని భర్తవైపు తిరిగింది. ఇంతలో బయట భళ్ళుమని చప్పుడు వినిపించింది. తను పరుగుతో డ్రాయింగ్‌రూం చేరుకొంది. ఆమె వెంట సురేంద్ర కూడా వచ్చాడు.

సునీల బిక్క మొహం వేసుకొని మాస్తోంది. నేల మీద గాజు ముక్కల మధ్య ఆ జపాను బొమ్మ పడి వుంది. "విరగ్గొట్టావూ? అది తెచ్చినప్పటి నుంచి అనుకొంటూనే వున్నాను, ఇలాంటిదేదో అవుతుందని. వున్నచోట వుండనిస్తే కదా. కనీసం వారం రోజులైనా జాగ్రత్తగా పెట్టుకోలేక పొయ్యాం. ఈ ఇంటికి ఏదైనా తీసుకురావడం దండగే" అన్నాడు సురేంద్ర. అతనికి బాగా కోపంగా వుంది. బాధగానూ వుంది.

గాజు ముక్కల మధ్య నుండి బొమ్మను పైకి తీసింది నీరజ. "అది పగిలిపోయే వరకు తల్లీ కూతుళ్ళకు నిద్రపట్టలేదు. ఇక ఆనందించండి" అన్నాడు విసుగ్గా.

సునీల భయంగా ఇటు తండ్రివైపూ, అటు తల్లివైపూ మాసింది. ఆ అమ్మాయి కళ్ళలో నీళ్ళు పొంగబోతున్నాయి. నీరజ సునీలను దగ్గరగా తీసుకొంది. "ఫర్వాలేదు లేమ్మా, నీవు కావాలని పగలగొట్టలేదుగా. చెయ్యి జారింది అంతే. ఇటు చూడు బొమ్మ అసలు విరగలేదు. నిజానికి ఇప్పుడే బాగుంది. ఏడవకు" అని రాలుతున్న కన్నీళ్ళు తుడిచింది.

సురేంద్ర కోపం కూడా తగ్గింది. "అయిపోయిందేదో అయిపోయింది. ఇంకా ఏడుపెందుకు? దీపక్ ఎక్కడున్నాడో చూడు. కొత్త కార్టూన్ ఫిల్ము వీడియో కాసెట్ తెచ్చాను చూద్దురుగాని" అన్నాడు కూతుర్ని దగ్గరకు తీసుకొని తల నిమురుతూ. "నేను ఐస్ క్రీం తెచ్చాను" అంది నీరజ టేబిల్‌పైన పెట్టిన ప్యాకెట్ విప్పుతూ. సునీల చెంగున దూకుతూ బయటికి వెళ్ళింది తమ్ముణ్ణి పిలవటానికి.

నీరజ మరోసారి బొమ్మవైపు మాసింది. ఎంతో రిలీఫ్ ఫీలయింది. తన సమస్యకు కూతురు తెలిసో తెలియకో చక్కటి పరిష్కారం చూపించింది. ఇప్పుడు జపనీస్ బొమ్మ బంధ విముక్తురాలిలా, స్వేచ్ఛా జీవిలా, లిబరేటెడ్ ఉమన్‌లా మరింత అందంగా కనిపించింది తన కళ్ళకు.

■

## జీవితంలో హాస్యం

### ■ టెన్షన్ — అటెన్షన్

త్యాగరాయ గాన సభలో ఒక సాహిత్య కార్యక్రమానికి వాసిరెడ్డి సీతాదేవి అధ్యక్షత వహిస్తే ముఖ్య అతిథులుగా మంత్రి రోశయ్య గారు, కవి డా. సి.నారాయణరెడ్డి ఆవిడకు చెరో వైపు కూర్చున్నారు. సీతాదేవి మాట్లాడుతూ "ఈ ప్రక్కన కూర్చున్నాయన రాజకీయ నాయకుడు, ఈ ప్రక్కన కూర్చున్నాయన మహాకవి. ఇద్దరూ టెన్షన్‌లో వుంటారు. నాకు భయంగా వుంది" అని అన్నారు.

డాక్టరు నారాయణరెడ్డి వెంటనే "మేం టెన్షన్‌లో వుండం, అటెన్షన్‌లో వుంటాం. మీరేం కంగారు పడకండి" అని సభికులను హాయిగా నవ్వించారు.

### ■ డా. వేదవ్యాస్ చురుకైన హాసం

డా. వేదవ్యాస్ ఆధ్యాత్మిక సంపన్నుడే గాక చక్కని వైద్య సలహాల నివ్వగల మహనీయుడు. ఒక రోజు కొంతమంది వున్న చిన్న సైజు లాంటి సభలో సంశయాలకు జవాబులిస్తున్నారు. ఒకాయన లేచి అయ్యా నాకూ రోగం వుంది. మందు తినకుండా తగ్గే ఉపాయం చెప్పండి అని అడిగాడు. సభికులంతా ఆశ్చర్యపోయి ఈ ప్రశ్నకు ఏం జవాబు చెబుతాడోనని ఎదురు చూస్తున్నారు. ఒక్క క్షణం వ్యాస్‌గారు తటపటాయింపు ఆలోచనతో అయ్యా మీకు మందు తినే ఓపిక కూడా లేదు గనుక మీకు రోగం వుంటేనే హాయిగా వుంటుంది. రోగంలో సుఖం వుంది. బ్రహ్మాండంగా పడుకోవచ్చని అందరిని గొల్లుమనిపించారు. ప్రశ్న వేసిన మనిషి తెల్లబోయాడు.

—జి. శ్రీశైలం, ఐ.డి.పి.ఎల్




### ■ నంబరు

మా నాన్నగారు ఓ పల్లెటూరులో ఉద్యోగం చేస్తున్న కొత్తలో మేము ఒక డాబాలో అద్దెకు వుండేవాళ్ళం. మా డాబాలోకి రావాలంటే బోదిగట్టు దాటుకొని మా ఇంటికి రావాలి.

మా యింటికి వచ్చిన చుట్టాలు కొందరు చీకట్లో ఆ బోదిగట్టు దాటలేక అందులో పడిపోయేవారు. ఆ పడిపోయినచోట నేను బోర్డు కట్టి '9' అంకె వేసినాను. మా మావయ్యగారు ఒకాయన మా యింటికి వస్తుండేవాడు. ఆయనకి ఆ బోర్డుమీద ఆ '9' అంకె ఎందుకు వేశామో అర్థం కాలేదు. మేం చెప్పలేదు కూడా.

ఒకసారి ఆయన బోదిగట్టు దాటుతూ క్రిందపడిపోయారు. అపుడు చికిత్స చేసి తిరిగి పంపించినపుడు ఆ బోర్డు మీద '10' అంకె వున్నది. అపుడు అర్థమైనది ఆయనకి బోదెగట్టు దాటుతూ పొరపాటున క్రిందపడ్డవాళ్ళ సంఖ్య ఆ బోర్డు అని.

— ఎం.సతీష్, పెనుగొండ